క్లుప్తంగా

నేడు వనువులమ్మ జాతర

కడియం: గ్రామ దేవత వనువులమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం జాతర, ఆదివారం తీర్థం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉదయం 9 నుంచి వ్యవసాయ విద్యుత్

కడియం: మండలం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా అవుతుందని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు తెలిపారు. రైతుల సౌకర్యం కోసం ఈ మార్పు చేశారన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. ఇప్పటి వరకు ఉదయం 5 గంటల నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది.

వృథాగా పోతున్న తాగునీరు



నీరు వృథా కాకుండా పైపులైన్ వాల్వుకు పెట్టిన కర్రముక్క

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వెంకటగిరికొండపై గోదావరి సురక్షిత మంచి నీటి పథకం ద్వారా విడుదలైన సురక్షిత తాగునీరు శుక్రవారం తెల్లవారుజామున వృథాగా పోయింది. పైపులైన్ వాల్వులు సరిగ్గా పనిచేయక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ సిబ్బంది ఆ వాల్వులో కర్రముక్క పెట్టి నీటి వృథాను అరికట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు

రాజానగరం: పాలిటెక్నిక్ చదువుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభిస్తాయని, దేశ, విదేశాలలో సైతం అవకాశాలు మెండుగా ఉంటాయని బొమ్మూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు అన్నారు. గైట్ కళాశాల ఎండీ కె.శశికిరణ్ వర్మ అధ్యక్షతన కళాశాలలో శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను చైతన్యపరిచారు.

మత్తుకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సెబ్ సీఐ బంగారురాజు

మధురపూడి: మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కోరుకొండ సీఐ బంగారురాజు అన్నారు. కోరుకొండలోని యశ్వంత్ ఐటీఐ కాలేజీలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే దుష్పరిణామాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ దురలవాట్లు విద్యార్థుల మనుగడకు ఆటంకాలు అవుతాయన్నారు.

అన్న సమారాధన



గాడాలలోని రాజ రాజేశ్వరి అమ్మవారు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అన్నసమారాధన జరిగింది. ప్రతి పౌర్ణమికి ఆలయ కమిటీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. గాడాల, మధురపూడి, నిడిగట్ల, రాయుడుపాకలు తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు.

సినిమాలు

శ్యామల	: ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యమినీ	: నింద
సూర్యప్యాలెస్	: హరోంహర
స్వామి	: మహారాజ
శివజ్యోతి	: ఏ
అనుశ్రీ	: మనమే
రాజా	: బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	: అంతిమతీర్పు
రంభ	: కేజీఎఫ్-1
మేనక	: ప్రేమకథాచిత్రమ్
అప్సర	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	: హనీమూన్ ఎక్స్‌ప్రెస్
నామవరం	
వీఎస్ మహల్	: మహారాజ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మహారాజ



యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, న్యాయమూర్తులు, న్యాయవాదులు



యోగా సాధకులకు మెమెంటోలు అందిస్తున్న కార్పొరేషన్ అదనపు కమిషనర్ సత్యవేణి



జాతీయ పోటీలకు వెళ్లిన విద్యార్థిని, ఆమె తల్లిని సత్కరిస్తున్న రామానుజన్ స్కూల్ హెచ్ఎం సత్యవతి

నిత్య సాధనతో రాజయోగం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు
- పాల్గొన్న ప్రముఖులు

కంబాలచెరువు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల యోగాసనాలను సాధన చేశారు. దానివల్ల కలిగే ప్రయోజనాలను యోగా శిక్షకులు వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత యోగా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక శ్రేయస్సును మెరుగు పరిచే అభ్యాసం అన్నారు. శారీరక, మానసిక ఒత్తిడులను తగ్గించుకోవడానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. యోగా శిక్షకుడు శ్యామ్ వివిధ రకాల యోగాసనాలతో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, యోగా విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో..

కేంద్ర కారాగారంలో పర్యవేక్షణాధికారి శ్రీరామ రాహుల్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. ప్రతి రోజూ ఉదయం యోగాధ్యానం, యోగాసనాలతో ఖైదీలు రోజును ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ అన్నారు. మధయోగ భారతి ట్రస్ట్ యోగా గురువులు అల్లు సత్యనారాయణ, నవీన తదితరులు ఖైదీలతో యోగాసనాలు, యోగధ్యానం చేయించారు. అష్టాంగ యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్, బి.రత్నరాజు, జైలర్లు కేవీ రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేష్ , సీహెచ్.రమేష్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఎన్‌సీసీ యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. దేశ, విదేశాలలో యోగా శిక్షకుడిగా పేరు పొందిన కళాశాల పూర్వ విద్యార్థి కృష్ణమూర్తి విచ్చేసి.. విద్యార్థులకు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు షేక్ జరీనా బేగం, డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ బి.భవానీదేవి, ఎన్‌సీసీ సమన్వయకర్త డాక్టర్ యూసఫ్ బాష, ఎన్‌సీసీ మహిళా విభాగ సమన్వయకర్త డాక్టర్ అనూష, డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.



కడియం హైస్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు

ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ తాను ఆస్తమాను జయించి ఆరోగ్యంగా ఉండటానికి యోగానే కారణమన్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో..

విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యానికి యోగా చాలా మంచిదని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ యోగా అనేది శరీరం, శ్వాస, మనసును కలిపే ఒక అభ్యాసమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యార్థి, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి అన్నారు. స్థానిక జేకే గార్డెన్స్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ, జిల్లా ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ సీహెచ్ రమేష్ మాట్లాడుతూ 'స్వయం, సమాజం కోసం యోగా' అన్న థీమ్‌తో 2024 యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు యోగా సాధకులను మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి డీఎంఎం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సాధన

ధవళేశ్వరం: క్రమం తప్పకుండా యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా సాధన చేశారు. వైద్యులు తాళ్లూరి దివ్య ఆసనాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, డాక్టర్ అభిషేక్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల వెంకటలక్ష్మి సంతోషి, మండల అధ్యక్షుడు ఎస్‌వీబీఎస్ ఆచారి ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో యోగాడే నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. యోగా గురువు డాక్టర్ గుర్రాల విమలత యోగా సాధన చేయించారు. పతాంజలి యోగా సమితి, వివేకానంద మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక కుసుమ హరినాథ్ బాబా మందిరంలో యోగా దినోత్సవం నిర్వహించారు.



కడియం హైస్కూల్లో మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీ శంకర్

మానసిక వికాసం

కడియం: మానసిక వికాసానికి యోగా చక్కటి సాధనమని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీ శంకర్ అన్నారు. స్థానిక హైస్కూల్లో జరిగిన యోగా దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ప్లానింగ్ కో ఆర్డినేటర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వై.నాగేశ్వరరావు, మణి కుమార్, తెలుగు ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. పాఠశాల పీడీలు ఎం.డేవిడ్, వీరబాబు.. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

ఎన్నో ఉపయోగాలు

యోగాతో ఎన్నో ఉపయోగాలున్నాయని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన యోగా డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరికీ ఉచిత యోగా శిక్షణ కోసం శాశ్వత ప్రదేశాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి నానీ తదితరులు మాట్లాడారు. యోగా గురువు ఆకుల తాతాజీ యోగాసనాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కడియం సర్పంచ్ శ్రీమతి మోసిగంటి సత్యవతి, బీజేపీ నాయకులు ఆకుల శ్రీధర్‌లతో కలిసి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు యోగా గురువు తాతాజీని ఘనంగా సత్కరించారు.

42వ డివిజన్‌లో..

సీటీఆర్ఐ: స్థానిక 42వ డివిజన్‌లో జరిగిన యోగా దినోత్సవానికి డాక్టర్ అనురాధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ స్కూల్లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటలోని శ్రీనివాస రామానుజన్ నగరపాలక సంస్థ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పీకేఎస్ సత్యవతి అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ నేతృత్వంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. జాతీయ స్థాయి యోగా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లులను హెచ్ఎం సత్యవతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు సత్కరించారు.



రామానుజన్ స్కూల్ విద్యార్థుల యోగాసనాలు

ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలి

ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజబాబు

పెదపూడి: రాష్ట్ర అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. పెదపూడి గ్రామంలోని కైకవోలు సెంటర్‌లో శుక్రవారం జరిగిన సంఘ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన పదేళ్లలో రాష్ట్రం అధోఃగతి పాలైందన్నారు. అధిక ధరలు, పన్నుల భారం, నిరుద్యోగం వంటి సమస్యలు పెరిగిపోయాయన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ, ప్రజా సమస్యలపై ప్రజా సంఘాలు నిరంతరం పోరాటం చేస్తాయన్నారు. ఏఐ ఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అధ్యక్షత వహించారు. వివిధ సంఘాల ప్రతినిధులు డి.నారాయణమూర్తి, ఎం.సత్యం, ఎల్లే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రంగంపేటలోని ఓ వీధి

భానుడి భగభగ

రంగంపేట: మండలంలో శుక్రవారం ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రుతు పవనాలు వచ్చేశాయంటూ ప్రచారం జరిగినా...ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తగ్గకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. వీధులన్నీ ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులున్న వారు మాత్రం జాగ్రత్తలు పాటిస్తూ, ప్రయాణాలు సాగిస్తున్నారు. జూన్ మూడో వారం కొనసాగుతున్నా ఎండలు తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఎండలు ఇదేవిధంగా కొనసాగితే ఖరీఫ్ సీజన్‌కు కష్టాలు తప్పవంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది మందికి ఉద్యోగాలు

రాజానగరం: దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఏపీ సోర్స్ సంస్థ శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ప్రస్తుతం నాలుగో సంవత్సరం బీ ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వార్షిక వేతనం రూ. మూడు లక్షలతో మెడికల్ కోడింగ్‌కు సంబంధించిన ఉద్యోగాలకు పదిమందిని ఎంపిక చేశారని కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.



రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా శుక్రవారం శాసన సభలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

ఆడుతూ.. చదువుతూ..

- నగర విద్యార్థుల ఘనత
- చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ
- పలు పతకాల కైవసం

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. స్కేటింగ్, కరాటే పోటీలలో పతకాలు సాధించి నగర ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన ఆర్ఎస్ఎఫ్ఐ జాతీయ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రింక్ 5 రోడ్డు రేస్‌లో కొండి లలిత్ వర్మ బంగారు పతకం, రింక్ 6 విభాగంలో రజిత పతకం సాధించాడు. ఈ ఘనత సాధించిన లలిత్‌ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. 67 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ, బాలుర విభాగంలో జి.వీర శ్రీవత్సవ్, అండర్ 17 బాలికల విభాగంలో ఎండీ మదసరున్నీసా ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ ఇన్‌లైన్ రోడ్డు రేస్‌లో కాంస్య పతకం సాధించింది.



జాతీయ స్కేటింగ్ పోటీలో పతకాలు సాధించిన లలిత్ వర్మను అభినందిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

కరాటేలో బంగారు పతకం

ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో ప్రభుత్వ అటానమస్ కళాశాల విద్యార్థి బి.నాగపండు ప్రతిభ చూపాడు. అండర్ 21 కరాటేలో కాటా 60 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. గతంలో రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పండు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ చూపాడు. బీఏ తృతీయ ఏడాది ఎకనామిక్స్ చదువుతున్న నాగపండు చదువుతో కూడా చురుగ్గా ఉంటాడు.

శిక్షణతో మంచి ఫలితాలు

ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతుల పేరుతో ఒక నెల రోజుల పాటు వివిధ క్రీడాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. వీటితో పాటు స్కూల్ గేమ్స్ వంటి క్రీడా పోటీల ద్వారా విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నారు.

సోమేశ్వరాలయంలో లక్షపత్రి పూజ



ప్రత్యేకాలంకరణలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి

పెదపూడి: గ్రామంలోని ప్రాచీన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్షపత్రి పూజ చేశారు. ఆలయ అర్చకుడు కె.వెంకట్రావు అధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక వినాయక వెంకటసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం శ్రీవారికి పుష్పోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమికి సారం



కలవచర్లలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతుందని, సూక్ష్మజీవులు వృద్ధి చెంది, ఏర్పడే జీవ రసాయన చర్యలతో నేల సారం పెరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. కలవచర్లలోని దుద్దుపూడి సుధాకర్ క్షేత్రంలో ఏర్పాటు చేసిన బీపీటీ 2858, బీపీటీ 2841 వరి వంగడాల ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరిరక్షణకు, దిగుబడులలో స్తబ్ధతను అధిగమించడానికి రైతులు తప్పనిసరిగా సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులను నేలకు అందించాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. దీని వల్ల ఆయా నేలల భౌతిక, రసాయన స్థితిగతులు బాగుపడి నేల సారవంతంగా తయారవుతుందన్నారు. ఇతర లోపాలు ఉంటే అవి కూడా సవరించబడతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. పొలంలో రసాయనిక ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి కూడా ఈ పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడతాయన్నారు. అంతేకాదు కలుపును కూడా అంతగా పెరగకుండా నివారిస్తాయన్నారు. జీలుగా, జనుము, పిల్లిపెసర, వంటి పచ్చిరొట్ట ఎరువులను సార్వా పంట కాలంలో సాగు చేసుకుని పంట తొలిపూత దశలో నేలలో కలియదున్నాలి. ఈ విధంగా చేయడంతో తరువాత సాగు చేసే వరి పంటకు ఎకరాకు 20 నుంచి 50 కిలోల నత్రజని ఆదా అవుతుందన్నారు. జనుము, జీలుగ వంటివి పశువులకు దాణాగా కూడా ఉపయోగపడతాయన్నారు.